క్లుప్తంగా

సిల్ట్ తీసిన మట్టి రోడ్డుపైనే



వర్షం కారణంగా డ్రెయినేజీ మట్టి రోడ్డు పైకి చేరి అధ్వానంగా ఉన్న దృశ్యం

నరసాపురం: పట్టణంలో ప్రధానమైన అల్లూరి కాంప్లెక్స్‌సెంటర్‌లో గత నాలుగురోజుల క్రితం డ్రెయినేజీలో తీసి సిల్ట్‌ను అలాగే వదిలేశారు. అయితే మంగళవారం వర్షం పడడంతో డ్రెయినేజీలో తీసి రోడ్డుమీదే ఉంచేసిన మట్టి తిరిగి డ్రెయినేజీల్లోకే వెళ్లిపోతుంది. అంతేకాకుండా వర్షం కారణంగా రోడ్డుమొత్తం బురదమయంగా మారింది. ప్రధానమైన మార్కెట్ ప్రాంతం కావడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. రోడ్డుపై ప్రయాణించే వారు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రెయినేజీ సిల్ట్ తీత పనులు అధ్వానంగా నిర్వహించారనడానికి ఇదో పెద్ద ఉదాహరణగా నిలిచింది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి పరిస్థితి చక్కదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

నరసాపురంలో చిరు జల్లులు

నరసాపురం: నరసాపురంలో మంగళవారం ఉదయం నుంచి చిరుజల్లులతో వర్షం పడింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకూ ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో వాతావరణం పూర్తిగా చల్లబడింది. మరో రెండురోజుల పాటు వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలపడంతో వేసవి తాపం నుంచి పూర్తిగా ఉపశమనం దొరికిందని ప్రజలు సంతోషపడుతున్నారు

నేడు ఎక్సైజ్ స్టేషన్ వద్ద వాహనాల వేలం

భీమవరం: భీమవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ మద్యం కేసుల్లో పట్టుబడిన 3 ద్విచక్ర వాహనాలకు బుధవారం వేలం నిర్వహిస్తామని సీఐ కె.బలరామరాజు తెలిపారు. వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

సచివాలయ బదిలీలు పారదర్శకంగా చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగ సంఘు నాయకులు

ఉండి: సచివాలయాల్లో ఉద్యోగుల బదిలీలు పారదర్శకంగా జరగాలని (ఏపీజీఈఏ) ఉద్యోగసంఘ నాయకులు తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీఓ శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఉద్యోగుల బదిలీ ప్రక్రియలో స్థానిక(నేటివ్) మండలంలో బదిలీలకు ఆప్షన్ కల్పించాలని కోరారు. రేషనలైజేషన్ పారదర్శకంగా అమలు చేయాలని మిగుల సిబ్బందికి సంబంధించి స్పష్టమైన విధివిధానాలు జారీ చేయాలని కోరారు.

ఎస్ఎస్ఏలోని రీప్లేస్‌మెంట్ ప్రొవిజనల్ సీనియార్టీ లిస్ట్ ప్రదర్శన

భీమవరం: సమగ్రశిక్ష ప్రాజెక్ట్‌లోని కాంట్రాక్ట్ సిబ్బంది రీప్లేస్‌మెంట్ ప్రొవిజనల్ సీనియార్టీ లిస్ట్ జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, జిల్లా విద్యాశాఖాధికారి నోటీసు బోర్డులో ప్రదర్శించినట్లు సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి శ్యామ్‌సుందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియార్టీ లిస్ట్‌పై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈనెల 27వ తేది లోపుగా సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కార్యాలయంలో అందజేయాలని శ్యామ్ సుందర్ తెలిపారు.

వీధి కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

పాలకోడేరు: వీధి కుక్కలు దాడి చేయడంతో ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని తూర్పుపేటలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన తొంటా సీతమ్మ, అనిమిరెడ్డి అన్నమ్మ రోడ్డుమీద ఉండగా ఒక్కసారిగా వీధి కుక్కలు వారిపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. గాయపడ్డ ఇద్దరిని స్థానికులు చికిత్స నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వీధి కుక్కలు ఆకస్మికంగా దాడి చేయడంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. వెంటనే అధికారులు స్పందించి వీధి కుక్కల సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రేపు స్టేక్ హోల్డర్ మీటింగ్

తణుకు అర్బన్: తణుకు పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం స్టేక్ హోల్డర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు మునిసిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తెలిపారు. తణుకు పురపాలక సంఘ పరిధిలో మాస్టర్ ప్లాన్ తయారీ దృష్ట్యా ఉదయం 11 గంటలకు తణుకు కౌన్సిల్ హాల్‌లో నిర్వహించనున్న ఈ సమావేశంలో వివిధ శాఖల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, సీడీఎంఏ, ఆర్‌డీఎంఏ, ఆర్‌డీడీటీపీ, డీటీసీపీ అధికారులతోపాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రభుత్వ శాఖాధికారులు హాజరవుతారని వివరించారు.

లారీలకు ఓకే.. బస్సులకు నో ఎంట్రీ

- పెనుగొండలో వింత పరిస్థితి
- అవస్థలుపడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు



పెనుగొండ గ్రామం మధ్యలో నుంచి వెళుతున్న లారీలు

పెనుగొండ: గ్రామం మధ్యలో నుంచి ఆర్టీసీ బస్సులు వెళితే ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడతాయంటూ అధికారులు ఆర్టీసీ బస్సులు రాకపోకలు నిలిపివేశారు. చోద్యమేమిటంటే భారీ వాహనాలు రాకపోకలను మాత్రం గాలికి వదలివేశారు. ఇది పెనుగొండ ప్రధాన రహదారిలో జరుగుతున్న తీరు. పెనుగొండ ఫ్లై ఓవరు పనులు జరుగుతుండడంతో గత 45 రోజులుగా వాహనాల రాకపోకలను నిషేధించారు. ఇదే సమయంలో నెగ్గిపూడి కల్వర్టు నిర్మాణం సైతం జరగడంతో పూర్తిగా వాహనాల రాకపోకలు నిషేధించారు. దీంతో వాహనాలు అటు ఆచంట మీదగాను, ఇటు ఆలమూరు మీదుగాను నెలరోజుల పాటు రాకపోకలు కొనసాగించాయి. నెగ్గిపూడి వద్ద కల్వర్టు నిర్మాణం పూర్తి కావడంతో వాహనాల రాకపోకలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.

వంతెన మరమ్మతులతో...

పెనుగొండలో వంతెన మరమ్మతులు జరుగుతుండడంతో చిన్నపాటి వాహనాలకు మాత్రం గ్రామ మధ్యలో నుంచి వెళ్లడానికి అనుమతులు ఇచ్చారు. అయితే, ఎలాంటి నియంత్రణ లేకపోవడంతో భారీ వాహనాలు సైతం గ్రామం మధ్యలో నుంచి ప్రయాణిస్తున్నాయి. ఆర్టీసీ బస్సులు మాత్రం రావడం లేదు. అధికారులు బస్సులకు ప్రయాణ అనుమతులు ఇవ్వక పోవడంతో గత మార్గంలోనే ఇంకా రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో ప్రజలకు పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. బస్సులు రాకపోవడంతో ఆటోల్లో ప్రయాణం చేస్తూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ముఖ్యంగా పెనుగొండలో విద్యనభ్యసించడానికి కళాశాలలకు వస్తున్న విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నిత్యం ఆటోలకు అధికంగా చెల్లించి ప్రయాణం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీల రాకపోకలకు లేని ఇబ్బందులు, బస్సుల రాకపోకలకు ఎందుకు అంటూ ప్రశ్నిస్తున్నారు. లారీల రాకపోకలతో గ్రామంలో తరచూ ట్రాఫిక్ జామ్ అవుతూ వస్తుంది. అలా ఇబ్బందులు పడుతూనే ప్రయాణం సాగిస్తున్నారు. ఆర్టీసీ వారు సైతం ఇదే రహదారిలో ప్రయాణం చేయడం వల్ల ప్రయాణికులకు ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. లేదంటే మొత్తం వాహనాల రాకపోకలను నిలిపివేయాలని వారు కోరుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి లారీల రాకపోకలను నిలిపి బస్సుల రాకపోకలకు అనుమతులు ఇవ్వాలని కోరుతున్నారు.



ఆటోలను ఆశ్రయిస్తున్న విద్యార్థులు



పెనుగొండలో మరమ్మతుల కోసం మూసేసిన ఫ్లైఓవర్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు సెంట్రల్: ఆగర్తిపాలెం 11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మెయింటెనెన్స్ పనులు చేస్తున్న కారణంగా ఈ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని నరసాపురం ప్రాంతీయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మధు కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆగర్తిపాలెం , సగంచెరువు, వెలివెల, గొల్లగూడెం, తిల్లపూడి, తిల్లపూడిపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

గ్రామస్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలి

భీమవరం అర్బన్: గ్రామంలో తాగునీటిని ఫిల్టర్ చేసి స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. భీమవరం మండలంలోని వెంప గ్రామంలో మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో తాగునీరు ఫిల్టర్ చేసి సరఫరా చేయాలని గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో కుళాయి ద్వారా సరఫరా చేసే నీరు బురదగా వస్తున్నాయని తాగడానికి ఏ మాత్రం పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ నీటితో స్నానం చేస్తే దురదలు వస్తున్నాయని వాపోయారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, పంచాయతీ సిబ్బంది స్పందించి స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మందా మార్తమ్మ, కాటికి సంపతరావు, బొడ్డు ఏసేబురాజు చిలకపాటి బేబి, కుర్రం లక్ష్మి నరసమ్మ, భూపతి మణి తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలిలో సచివాలయ ఉద్యోగుల నిరసన



ఈఓపీఆర్డీ జేడీవీ ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు

యలమంచిలి: సచివాలయ ఉద్యోగుల బదిలీల జీఓ-5ను సవరించాలని కోరుతూ మంగళవారం సచివాలయ ఉద్యోగులు మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. సొంత మండలంలో బదిలీలకు అవకాశం కల్పించాలని, రేషనలైజేషన్ మిగులు సిబ్బంది పై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, సర్వీస్ రూల్, ప్రమోషన్ చానల్, నోషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈఓపీఆర్డీ జేడీవీ ప్రసాద్‌కు, తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు షేక్ ఉమర్ ఆలీషా, జిల్లా సహాయ కార్యదర్శులు జి ప్రసాద్, సీహెచ్ రాజేష్ , నర్సాపురం తాలూకా సహాయ కార్యదర్శి పులపర్తి సత్య సునీల్, నాయకులు డీయూవీ సత్యనారాయణ, ఎన్ ప్రశాంత్ బాబు, సీహెచ్ కనకదుర్గ, బి.భవానీ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి నిత్యావసరాల అందజేత



మరియమ్మకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న కర్రా జయసరిత

పాలకొల్లు సెంట్రల్: అన్నార్తులకు సహాయం చేయడంలోనే నిజమైన దైవత్వం ఉంటుందని వైఎస్సార్ సీపీ మహిళ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా జయసరిత చెప్పారు. మండలంలోని పూలపల్లి గ్రామానికి చెందిన వితంతు మహిళ పాలపర్తి మరియమ్మ ఇళ్లలో పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. ఆమె కుమారుడు నాని అనారోగ్యానికి గురై మూడేళ్లుగా మంచానికే పరిమితమయ్యాడు. స్థానికుల ద్వారా వారి విషయం తెలుసుకున్న జయసరిత మంగళవారం మరియమ్మ ఇంటికి వెళ్లి తన వంతు సహాయంగా రూ.5 వేలు విలువైన బియ్యం బస్తా, కిరాణా సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ఆమె వెంట వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జోగాడ ఉమామహేశ్వరరావు, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉనికల శ్రీనివాస్, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవ రాజేష్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మామిడిశెట్టి చిట్టిబాబు, వీరా మల్లికార్జునుడు, రామానుజుల చిన మధు, దొమ్మేటి శ్రీను, దొమ్మేటి లోకేష్, అన్నారపు రమణ, కోటి నాగబాబు, చవాకుల అర్జునరావు, మల్రి నాగరాజు ఉన్నారు.

డ్రోన్‌తో పిచికారీ అలవాటు చేసుకోవాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, అధికారులు

పాలకొల్లు సెంట్రల్: కూలీలు రసాయన మందులు పిచికారి చేయడం వల్ల రసాయనాలు శరీరంపై పడి అనారోగ్య సమస్యలు వస్తున్నాయని, దీనిని నివారించేందుకు రైతులు డ్రోన్ ద్వారా రసాయన మందులు పిచికారి చేయించాలని సహాయ వ్యవసాయ సంచాలకులు పార్వతి కోరారు. చింతపర్రు గ్రామంలోని రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అదే సమయంలో రైతులు నవధాన్యాల సాగు ద్వారా భూసారాన్ని పెంచుకుని ప్రకృతి వ్యవసాయ సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె కోరారు. మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ క్రాప్ ఇన్సూరెన్స్ కౌలు కార్డుల ప్రాధాన్యత గురించి వివరించారు.

హాస్టళ్లలో కలెక్టర్ తనిఖీలు



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ఉండి: హాస్టల్ విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఉండిలో ఎస్సీ బాలికల హాస్టల్,కళాశాల బాలుర బీసీ హాస్టల్‌ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ నిర్వహణ,విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, భోజనం, అధికారుల తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా పెదపేటలోని ఎస్సీ బాలికల హాస్టల్స్‌ను తనిఖీ చేసి విద్యార్థుల చదువులపై ఆరా తీశారు. అనంతరం ఉండి బీసీ కళాశాల బాలుర హాస్టల్‌ను ఆమె సందర్శించారు. హాస్టల్స్ తనిఖీ అనంతరం ఉండి సంతమార్కెట్‌లో సాధారణ వ్యక్తి కూరగాయాల ధరలు తెలుసుకున్నారు. కూరగాయల విత్తనాల వ్యాపారి వద్దకు వెళ్లి పెరట్లో నాటేందుకు చిక్కుడు విత్తనాలు కొనుగోలు చేశారు. ఆమె వెంట తహసీల్దార్ నాగార్జున, ఎంపీడీఓ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వర్షంలోనే మరమ్మతులు



వర్షంలో మరమ్మతులు చేపడుతున్న దృశ్యం

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో 165 జాతీయ రహదారి పొడై గోతులమయంగా మారడంతో నిత్యం ఈ రహదారిపై ప్రయాణించే ప్రయాణికులు ప్రమాదాలకు గురవడంతో గతంలో మరమ్మతులకు నోచుకోని రోడ్లు వాహనదారులు విన్నవించుకున్నా అధికారుల్లో గానీ, పాలకులలలో గాని చలనం లేదు. అయితే ఈ రెండు మూడు రోజుల నుంచి వర్షం కురవడంతో రోడ్డు విపరీతంగా ఛిద్రమవ్వడంతో అధికారులు మరమ్మతులు చేపట్టే కార్యక్రమానికి పూనుకున్నారు. విచిత్రం ఏమిటంటే మొన్నటి వరకు భీకరమైన ఎండలు కాసిన సమయంలో మరమ్మతులు చేయడం మానేసి వర్షం పడుతున్నప్పుడు చేస్తుండడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.

రెండో రోజు మున్సిపల్ ఉద్యోగుల రిలే దీక్షలు



మున్సిపల్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేస్తున్న దృశ్యం

నరసాపురం: మున్సిపల్ ఇంజినీరింగ్ సెక్షన్‌లో కాంట్రాకక్ట్ పద్ధతిపై పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ఆందోళన రెండో రోజుకు చేరుకుంది. మంగళవారం మున్సిపల్ కార్యాలయంవద్ద రిలే దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలో 40 మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించే వరకూ ఆందోళన విరమించేదిలేదన్నారు. ఎన్నికల సమయంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికులను రెగ్యులైజ్ చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి కోటిపల్లి కాశీ, ఎం.రత్నం, సీహెచ్ సత్యనారాయణ, ఫణి తదితరులు నాయకత్వం వహించారు. వైఎస్సార్ సీపీనేత, కౌన్సిలర్ యర్రా ఉమాశ్రీనివాస్ శిబిరాన్ని సందర్శించి దీక్షకు సంఘీభావం తెలిపారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



పాలకొల్లు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేస్తున్న మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు

పాలకొల్లు సెంట్రల్: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికులు నిరసన దీక్ష చేశారు. జేఏసీ పిలుపుమేరకు చేపట్టిన దీక్షలో సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పదేళ్లు పైబడి సర్వీస్ ఉన్న వారిని రెగ్యులర్ చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ వర్తింపు చేయాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ దీక్షలో మున్సిపల్ కార్మికులు కర్రా ప్రభాకరరావు, రాజా, భవాని, శంకర్, రాజశేకర్, ఆంజనేయులు, గోపి, ధనరాజ్, భాష, మల్లేష్, గణేష్, రవి, దుర్గాప్రసాద్, గణేష్ , రమణ, వాసు తదితరులు పాల్గొన్నారు.

నరేష్‌కు పయనీర్ నేషనల్ అవార్డు



నేషనల్ అవార్డు అందుకుంటున్న చవాకుల నరేష్

పాలకొల్లు సెంట్రల్: పట్టణానికి చెందిన చవాకుల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చవాకుల నరేష్ ట్రస్ట్ ద్వారా సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించి హైదరాబాద్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం పయనీర్ నేషనల్ అవార్డు ప్రధానం చేసింది. విశ్వ విద్యాలయంలో మంగళవారం పుడమి సాహిత్య వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాహిత్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు చిలుముల బాలరెడ్డి నరేష్‌కు అవార్డు అందజేసి, సత్కరించారు.

రేపు పెనుగొండలో జాబ్‌మేళా

పెనుగొండ: స్థానిక విశ్వతేజ డిగ్రీ కళాశాలలో 1ఎం1బీ సమన్వయంతో గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు 1ఎం1బీ ఫౌండేషన్ జిల్లా మేనేజర్ జాన్‌తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ యువతలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ, సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా ఫౌండేషన్ కృషి చేస్తుందని వివరించారు. దీనిలో భాగంగా ఉద్యోగ మేళాలో 12 ప్రముఖ కంపెనీలు 400లకు పైగా ఉద్యోగాలు లభించనున్నాయన్నారు. పదో తరగతి, ఐటీఐ, డిప్లమో, డి-ఫార్మసీ, బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ, ఏదైనా డిగ్రీ అర్హత ఉన్నవారు మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. అభ్యర్థులు తప్పనిసరిగా బయోడేటా, అర్హత సర్టిఫికెట్లు, జిరాక్స్‌లు తీసుకురావాలన్నారు. మిగిలిన వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

పథకం ప్రకారం ప్రభుత్వ విద్య నిర్వీర్యం



బ్రాహ్మణచెర్వు ఉప్పర కాలనీ వాసుల సమస్యలు తెలుసుకుంటున్న రమాదేవి

పెనుమంట్ర: మండలంలోని బ్రాహ్మణ చెరువు ఓడూరు శివరావుపేట స్కూల్స్ నీ కలిపిన నేపథ్యంలో పేద, వెనుకబడిన తరగతుల ప్రాంతాల పిల్లలు ప్రభుత్వ విద్యకు దూరం అవుతారని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.రమాదేవి పెనుమంట్ర బ్రాహ్మణ చెరువు వెలమపేట పాఠశాలకు వెళుతున్న మందులు వారి కాలనీ సందర్శించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ స్కూలు విలీనం చేయడం వల్ల మా పిల్లలు మెయిన్ రోడ్ కుండా సుమారు కిలోమీటర్ పైనే దూరం నడుచుకుంటూ వెళ్లావలసి వస్తుందని పిల్లలకు భద్రత కరువు అవుతుందని ఐద్వా బృందం ముందు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రభుత్వం పథకం ప్రకారం ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేయడం కోసం కుట్ర పడుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా ఐద్వా అధ్యక్ష,కార్యదర్శులు కేత పద్మజ, పొగాకు పూర్ణ కౌలు రైతు సంఘం పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు కుసుమపూడి సుబ్బరాజు, కేవీపీఎస్ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలల విలీనాన్ని ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న టి.అప్పలస్వామి

పాలకొల్లు సెంట్రల్: మోడల్ స్కూల్స్ పేరుతో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను విలీనం చేసే ప్రక్రియను తక్షణమే ఆపాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా కార్యదర్శి టి.అప్పలస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఏ కార్యకర్తల సమావేశం పుల్లూరి రాంప్రసాద్ అధ్యక్షతన మంగళవారం స్థానిక ఏఎస్ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల కూడలిలో నిర్వహించారు. ఈ సమావేశంలో అప్పలస్వామి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. విలీనాన్ని ఆపని పక్షంలో విద్యార్థి సంఘాల ఐక్య కార్యాచరణ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలను విలీనం చేయడం ద్వారా పరోక్ష పద్ధతిలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలకు లాభం చేకూరుస్తుందన్నారు. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఒక పక్క ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామంటూ మరో పక్క ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. అనంతరం ఏఐఎస్ఏ పాలకొల్లు పట్టణ నూతన కమిటీని 9 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మెడవల రాజా, ఉపాధ్యక్షుడిగా ఆర్ మణిదీప్, కార్యదర్శిగా బండి పెద్దిరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జె.శ్రీరామ్, కె.ఆకాశ్, పి.రవికుమార్, పి.లిఖిత్ కుమార్, సీహెచ్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణం పూర్తయ్యేదెప్పుడు?



పెదకాపవరం-క్రొవ్విడి రహదారి దుస్థితి

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం గ్రామం నుంచి క్రొవ్విడి, కొల్లేరు వెళ్లే రహదారుల పునర్నిర్మాణానికి గత ప్రభుత్వంలో కేంద్ర రోడ్డు నిధులు(సీఆర్ఎఫ్) సుమారు రూ. 50 కోట్లు మంజూరు అయ్యాయి. రహదారి నిర్మాణ పనులకు రెండేళ్ల క్రితమే భూమి పూజలు చేశారు. పెదకాపవరం నుంచి క్రొవ్విడి వరకూ రోడ్డు కం రిటర్నింగ్ వాల్ నిర్మాణం, పెదకాపవరం నుంచి గంటలరాయుడు పేట వరకూ రోడ్డు విస్తరణ, పునర్నిర్మాణం పనులకు నిధులు మంజూరయ్యాయి. ఏడాది క్రితం పెదకాపవరం-క్రొవ్విడి వరకూ పంట కాల్వకు రిటర్నింగ్ వాల్ నిర్మాణం పూర్తి చేశారు. అదే విధంగా పెదకాపవరం-గంటలరాయుడు పేట వరకూ రోడ్డు విస్తరణ కోసం ఆక్రమణలను తొలగించారు.రిటర్నింగ్ వాల్ నిర్మాణం పూర్తి అయినప్పటికీ ఇంత వరకూ బిల్లులు చెల్లించలేదని, దీంతో సంబంధిత కాంట్రాక్టర్ డైలమాలో పడ్డారని ఆర్అండ్‌బీ అధికారులు చెబుతున్నారు.

ఎక్కడ పని అక్కడే

ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే అన్న చందంగా ఉండిపోయాయి. ఈ ఏడాది వేసవి కాలంలో పనులు ప్రారంభించేందుకు సిద్ధమైనప్పటికీ నిధులు విడుదల కాకపోవడంతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీంతో క్రొవ్విడి, బావాయిపాలెం మీదుగా గణపవరం వెళ్లే వాహనాలకు, ప్రజలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. ఈ రహదారి భారీ గుంతలతో ఉండటం వల్ల వేసవిలో రోడ్డును చదును చేయించారు. అయినప్పటికీ వర్షం వస్తే జారుడుబల్లకంటే దారుణంగా రోడ్డు ఉంటుందని వాహనచోదకులు వాపోతున్నారు. పెదకాపవరం-గంటలరాయుడు పేట రోడ్డు నిర్మాణం చేపట్టకపోవడంతో గుంతలు గుంతలుగా మారింది. కొల్లేరు తీరంలోని చేపలు, రొయ్యల చెరువులకు మేత తీసుకువెళ్లేందుకు, చేపలు, రొయ్యల లోడుతో లారీల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుందని ప్రజలు వాపోతున్నారు.